



CSR

# ప్రజల మనిషి

ప్రజాసేవే తమ జీవిత పరమావధిగా సుమారు 35 ఏండ్ల రాజకీయ జీవితం గడిపిన ధీరోదాత్త మహానాయకుడు డా. మర్రి చెన్నారెడ్డిగారు రాష్ట్ర బహుముఖ ప్రగతికి చేస్తున్న కృషి, భారత రాజకీయ రంగంలో ఆయన నిర్వహిస్తున్న గురుతర పాత్ర ఈ ప్రచురణలో సంక్షిప్తంగా ప్రస్తావించడం జరిగింది. బుక్ లింక్స్ కార్పొరేషన్ వారు చేసిన విజ్ఞప్తిని పురస్కరించుకొని డాక్టరుగారి జీవిత విశేషాలు కూడా క్లుప్తంగా ఈ రచనకు జోడించాను.

డాక్టరు గారి గురించి అభిప్రాయం వ్యక్తపరిచే అవకాశం కల్పించినందుకు ప్రచురణ కర్తలకు కృతజ్ఞత తెలుపుతున్నాను.

తుల్లపాటి కుటుంబరావు
అధికార భాషా కమిషన్ సభ్యులు
ఆంధ్రప్రదేశ్

విజయవాడ

తొలి ప్రచురణ: నవంబర్, 1979
తుర్లపాటి కుటుంబరావు
ప్రచురణ కర్తలు: బుక్ లింక్స్ కార్పొరేషన్ లిమిటెడ్
నారాయణ గూడా
హైదరాబాద్ - 500 027

**మామాట**

స్వాతంత్ర్య సమరంలో ఆ తర్వాత దేశ పునర్ నిర్మాణ కార్యక్రమంలో ఇతర ప్రాంతాల వారివలె మన రాష్ట్రానికి చెందిన ఎందరో ప్రముఖులు ఎన్నో త్యాగాలు చేశారు.

మన దేశంలోనే కాక అనేక ప్రపంచ దేశాల్లో తెలుగు వారు ఎన్నో గురుతర బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కీలకమైన పదవు ల్లో ఉండి ఆయా ప్రాంతాల్లో అసంఖ్యాక ప్రజానీకానికి తమ సేవల వల్ల ప్రయోజనం లభించేటట్లు నిరంతరం కృషి చేస్తున్నారు. అనేక కారణల వల్ల వారి శక్తి సామర్థ్యాలకు, ప్రతిభకు తగిన ప్రచారం లభించడం లేదు, ఇదొక విషయం.

దేశ పరిపాలనా బాధ్యతల నిర్వహణ విషయంలో గత మూడు దశాబ్దాలుగా ఆంధ్ర ప్రముఖులు అనేక మంది ప్రముఖ పాత్ర నిర్వహించారు. సమాజంలో అన్ని తరగతులకు చెందిన వారిలో లోటు పాట్లు ఉన్నట్లే మన నాయకుల్లో కూడా కొందరిలో కొన్ని బలహీనతలు గాని, లోటుపాట్లు గాని ఉంటే ఉండవచ్చు. అయిన దానికి, కాని దానికి నాయకులను విమర్శించే వారు విమర్శించినా సమాజానికి ఈ నాయకులు చేసిన సేవలు, వారి జీవిత విశేషాలు, వారు నిర్వహించిన పాత్రను మనం విస్మరించలేము. ఈ అంశం దృష్టిలో ఉంచుకొనే కొందరు ఆంధ్ర ప్రముఖుల జీవిత విశేషాలు ప్రచురించడం అవసరమని స్నేహితులు మమ్ములను ప్రోత్సహించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి డా. మర్రి చెన్నా రెడ్డిగారి గురించిన ప్రచురణతో ప్రముఖులు జీవిత విశేషాల ప్రచురించాలన్న ఆలోచనకు కార్య రూపం ఇవ్వడం జరిగింది.

సుప్రసిద్ధ నాయకులు జీవిత విశేషాలను చక్కగా విడమర్చి చెప్పడంలో తనకు తానే సాటి అని పేరుపొందిన, తెలుగు ప్రజలందరికి సుపరిచితులైన ప్రముఖ పత్రికా రచయిత, అధికార భాషా సంఘం సభ్యులు అయిన శ్రీ తుర్లపాటి కుటుంబరావు గారు ఈ బాధ్యత నిర్వహణకు తగినవారని మేము భావించాము.

మేము కోరగానే డా. మర్రి చెన్నా రెడ్డి గారి జీవిత విశేషాలను మాత్రమే కాక ముఖ్య మంత్రిగా ఆయన చేసిన వివిధ ప్రసంగాలను, అమలు జరిపిన పథకాలను, చేపట్టిన కార్యకలాపాలను సమీక్షిస్తూ వ్రాశారు. వారికి మా కృతజ్ఞత.

ఇట్లు
కె, బి. సత్యనారాయణ
ప్రచురణ కర్తలు

బుక్ లింక్స్ కార్పొరేషన్
నారాయణగూడా
హైదరాబాద్.

డాక్టర్ మర్రి చెన్నా రెడ్డి మేధావి, ఉత్సాహి, సాహసవంతుడు, పరిపాలనా దక్షుడేకాక క్షణంలో ఏ విషయాన్నైనా లోతుగా అర్థం చేసుకోగల మహావ్యక్తి.

నాకు వారితో పరిచయం ఏర్పడిన కొద్ది కాలంలోనే రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి ఆయన జరుపుతున్న కృషి నన్ను ముగ్ధుడిని చేసింది.

గవర్నర్ శ్రీ కె. సి. అబ్రహాం.

# 20 నెలల్లో సర్వతో ముఖాభివృద్ధి

ఎందరో మహనీయుల త్యాగ ఫలంగా 1947 లో మనదేశం స్వాతంత్ర్యాన్ని సముపార్జించుకొని సర్వతంత్ర స్వతంత్రాధి కారాలతో 1950 లో ప్రజాస్వామిక రిపబ్లిక్ గా అవతరించింది. స్వరాజ్య ఫలితాన్ని దేశంలో ప్రతి వ్యక్తికి అందచేసి సర్వతో ముఖంగా దేశాన్ని అభివృద్ధి పరిచేందుకు మన జాతీయ నాయకులు కంకణం ధరించారు.

మన తొలి ప్రధాని, మహానాయకుడు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ దేశ ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారు. ప్రణాళికాబద్ధమైన వికాస కార్యక్రమాలకు నాంది పలికారు. దేశాన్ని పారిశ్రామికవంతం చేయడానికి పథకాలు వేశారు. సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలో దేశం ఉన్నత స్థానాన్ని అందుకొనేటందుకు చక్కటి సోపానాలను ఏర్పరిచారు. వ్యవసాయ ప్రధానమైన ఈ దేశాన్ని సస్యశ్యామలం చేసే నిమిత్తం వివిధ ప్రాంతాలలో నదులపై ఆనకట్టలు కట్టడానికి తలపెట్టారు. నవ భారత నిర్మాణానికి ఆ విధంగా ఆయన గట్టి పునాదులు నిర్మించారు. అలీన విధాన కర్తగా నెహ్రూజీ దేశ కీర్తి ప్రతిష్ఠలను దిగంత వ్యాప్తం చేశారు. నెహ్రూ అనంతరం దేశ నాయకత్వాన్ని స్వీకరించి స్వల్ప కాలం మాత్రమే ప్రధానిగా ఉన్న శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి సయితం అవే విధానాలను కొనసాగించి చిరకీర్తిని ఆర్జించుకున్నారు.

అటు తరువాత దేశ సారథ్యాన్ని వహించిన శ్రీమతి ఇందిరా గాంధీ ప్రధాన మంత్రిగా దేశ గౌరవాన్ని ఎంతగానో పెంచారు. పదకొండు సంవత్సరాల పదవీకాలంలో దేశానికి సుస్థిరమైన పాలన చేకూర్చడమై గాక అన్ని వర్గాల శ్రేయో సంక్షేమాల నిమిత్తం ముందెనడూ లేనంతగా కార్యక్రమాలను అమలు జరిపారు.బలహీన వర్గాల చీకటి జీవితాలలో ఆనంద జ్యోతులు వెలిగించారు వ్యవసాయిక, పారిశ్రామిక రంగాలలో ఎన్నో రెట్లు ఉత్పత్తి పెరిగింది.

అప్పుడప్పుడు తలెత్తే అరాచక శక్తులను అదుపులోకి తెచ్చి ప్రజా జీవితంలో శాంతి, సుఖం నెలకొనేటట్టు చేశారు. శ్రీమతి ఇందిరా గాంధీ రూపొందించిన అభివృద్ధి కార్యక్రమాలు సర్వేసర్వత్రా నవ చైతన్యం కలిగించాయి.

## దేశంలో అశాంతి

1977 ఎన్నికలలో అప్పటి రాజకీయ వాతావరణాన్ని ఆసరగా తీసుకొని కొన్ని పరస్పర వ్యతిరేక రాజకీయ పక్షాలు ఏకమై కేంద్రంలో అధికారాన్ని హస్తగతం చేసుకొన్నాయి. అధికార పక్ష ముఠాల మధ్య కలహాలవల్ల అనుక్షణం ప్రభుత్వం ఎప్పుడు పడిపోతుందో అనే పరిస్థితి ఏర్పడింది. చాలా రాష్ట్రలలో కూడా ప్రభుత్వాల సుస్థిరత సన్నగిల్లింది.వివిధ రంగాలలో ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో అశాంతి ప్రబలింది దేశ రాజధాని ఢిల్లీ నగరంలో సయితం ప్రజల మాన ప్రాణాలకు ఆస్తులకు రక్షణ లేకుండా పోయింది. జనతా పార్టీలో ఆది నుంచి పెరుగుతూ వచ్చిన కీచులాటలు అంతర్జాతీయ రంగంలో మన దేశ ప్రతిష్ఠను దెబ్బతీసినవని పరిశీలకులు భావిస్తూవచ్చారు. కొత్త విదేశాంగ విధానం మన పొరుగు దేశాలకు సహాయ పడిందేమో కాని మనకు మాత్రం ఇసుమంత మేలు చేయలేకపోయింది. ధరలు ఆకాశాన్ని అంటాయి. అల్లకల్లోల పరిస్థితులు పోలీసు శాఖకు సయితం విస్తరించాయి ఎక్కడ చూసినా ఒకటే అశాంతి , ఒకటే అరాచకం.

జనతా పార్టీ పాలనలో భారత రాజకీయాకాశంలో కారు మేఘాలు ఆవరించాయని, దేశ ఆర్థిక పరిస్థితి విచ్ఛిన్నమైనదని శాంతి భద్రతలు క్షీణించాయని ఎన్నో ఆరోపణలు వచ్చాయి. ఇందిరాగాంధి ప్రభుత్వం ఎంతో ప్రయాసతో సమకూర్చిన విదేశీ మారకం ద్రవ్య నిలువలు హరించిపోయాయని, దొంగ రవాణా వ్యాపారులు కడచిన రెండున్నర సంవత్సరాలలో విశృంఖులురై, దేశాన్ని కష్టాల పాలు చేసినట్టు వార్తలు వస్తున్నాయి. ద్రవ్యోల్బణం మళ్ళీ విజృంభించి సామాన్యుడి జీవితాన్ని దుర్భరం చేస్తున్నది.

## రాష్ట్రంలో ప్రశాంతి

కేంద్రంలోనూ, ఇతర రాష్ట్రాలలోనూ పరిస్థితి ఇలా ఉండగా ఆంధ్రప్రదేశ్ లో ముఖ్య మంత్రి డాక్టర్ చెన్నారెడ్డి నాయకత్వాన కాంగ్రెస్ [ఐ] ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాల పట్ల దృష్టి ని కేంద్రీకరించి నిర్విరామంగా కృషి చేస్తున్నది. దేశంలో మరే రాష్ట్రంతో పోల్చినా మన రాష్ట్రంలో శాంతి భద్రతలు మెరుగుగా ఉన్నాయి. తెలుగు నాట పౌర జీవనం సుఖ శాంతులతో సాగుతున్నది. అభివృద్ధి కార్యక్రమాలు ద్విగుణీకృతోత్సాహంతో అమలు జరుగుతున్నాయి.

## సుదీర్ఘమైన పరిపాలనానుభవం

క్రిందటి పర్యాయం జరిగిన ఎన్నికలలో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ [ఐ] పట్ల, శ్రీమతి ఇందిరాగాంధి నేతృత్వం పట్ల డాక్టర్ చెన్నారెడ్డి నాయకత్వం పట్ల అచంచలమైన విశ్వాసాన్ని ప్రకటించారు. అపూర్వమైన ఆదరణ చూపించారు. ఆ పార్టీకి ఘనవిజయాన్ని చేకూర్చి అధికారంలో ప్రతిష్ఠించారు. సుదీర్ఘమైన పరిపాలనా అనుభవంగల మన ముఖ్యమంత్రి రాష్ట్రాభ్యు దయ రథాన్ని ఒడుదుడుకులు లేకుండా, వేగంగా, ముందుకు నడిపిస్తున్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలలో ప్రధానమైన పదవులను నిర్వహించడమే కాకుండా, ఉత్తరప్రదేశ్ వంటి సువిశాలమైన రాష్ట్రానికి గవర్నరుగా ఉండి డాక్టర్ చెన్నారెడ్డి గణనీయమైన అనుభవాన్ని గడించారు. స్వత: సిద్ధమైన సామర్థ్యానికి అనుభవం తోడు కాగా డాక్టర్ చెన్నారెడ్డి నాయకత్వం మన రాష్ట్రం అన్ని విధాలా ముందుకు పోవడానికి దోహదం

చేస్తున్నది. అందువల్లనే దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం తన పూర్తి పదవీ కాలం, అంటే అయిదు సంవత్సరాలలో సాధించలేని ఎన్నో ఘనవిజయాలను ఈ రాష్ట్రం స్వల్ప వ్యవధిలోనే సాధించగలిగింది.

డాక్టర్ చెన్నారెడ్డిగారు ప్రజల మనిషి. ప్రజా శ్రేయస్సునే కాంక్షిస్తూ, లక్ష్య సాధనకు నిర్విరామంగా కృషి చేస్తున్న ప్రజా నాయకుడు. ఈర్ష్య, అసూయల వల్ల రాజకీయ కారణాల వల్ల ఆయనపై ఎవరు ఎన్ని అభాండాలు వేసినా పేద ప్రజల సముద్ధరణ ప్రయత్నం నుంచి దృష్టిని మరల్చని ధీరోధాత్తుడు ఆయన. విమర్శను సహృదయంతో స్వీకరించి అందరితో మైత్రీభావం పెంపొందించుకోవాలని ఆయన అభిప్రాయం రాష్ట్ర సమగ్ర వికాసానికి అదే ఉత్తమ మార్గమని ఆయన విశ్వాసం.

## అందరినీ కలుపుకుపోవాలన్న ఆకాంక్ష

హైదరాబాద్ లో 1979 మే 10వ తేదీన గోల్కొండ పత్రికకు ప్రారంభోత్సవం చేస్తూ డాక్టర్ చెన్నారెడ్డి తన అభిప్రాయాన్ని ఇలా స్పష్టం చేశారు : "ఎవరు ఏమన్నా, ఎన్ని విమర్శలు చేసినా అందరినీ కలుపుకుపోవాలన్నదే నా ప్రయత్నం. కేవలం రాష్ట్ర అభివృద్ధిని దృష్టి లో ఉంచుకొని దానిని సాధించేందుకు సహనంతో అందరినీ కలుపుకు పోవాలని నేను అనుకొంటున్నాను. పదవులు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి. అయితే, పదవిలో ఉండగా పది మందికి ఉపయోగపడే పని చేయాలన్నదే నా ఉద్దేశం. ఎవరినో సాధించి, చరిత్ర సృష్టించాలని నేను ఎప్పుడూ ఆలోచించను. అలాంటి చరిత్ర ఎవరికి గుర్తుంటుంది? అందుకే అలాంటి చరిత్రపై విశ్వాసం లేదు ".

## అన్ని మతాల ఆదరణ

తన దేశాన్ని తన రాష్ట్రాన్ని ఎంతగా అభిమానిస్తారో ఆయన అంతగా తన మతాన్ని, తన సంస్కృతిని అభిమానిస్తారు అయితే, ఇతర మతాల పట్ల, కూడా అంతే సమాదరణ చూపగల ఔదార్యం ఆయనకు ఉంది. ఒక ముస్లిం పర్వదిన సభలో మాట్లాడుతూ ఆయన ' హిందువు అయినందుకు నేను గర్విస్తున్నాను. ముస్లిములైనందుకు మీరూ గర్వించండి" అన్నారు. సంకుచితత్వం లేని రీతిలో తన మతాన్ని, సంస్కృతిని అభిమానించడంలో ఆయన ఘనత ఉన్నది. కులానికి ఆయన ప్రాధాన్యం ఇవ్వరు. ఒకానొక సభలో మాట్లాడుతూ "యాదవ కులంలో పుట్టిన శ్రీకృష్ణుడు లోకారాధ్యుడైనాడు. ఏ కులంలో పుట్టితేనేమి ? ప్రతిభా వ్యుత్పత్తులతో మనిషి ఎదగాలి. అందుకే కులానికి ప్రాముఖ్యంలేదు ". రాయన.చారిత్రక కారణాల వల్ల సమాజంలో అట్టడుగున వుండి పోయిన హరిజనుల పట్ల, వెనుకబడిన తరగతుల పట్ల ఆయనకు అపారమైన సానుభూతి ఉంది ఆయన రూపొందించిన విధానాలలో, తీసుకొనే చర్యలలో బడుగు వర్గాలకు ఏదైనా మేలు చేయాలనే ఆర్తి అడుగడుగునా కనిపిస్తుంది. మాటలలో గాక చేతలలో మంచిని చూపించడం ఆయన విధానం.

డాక్టర్ చెన్నారెడ్డి ముఖ్యమంత్రి పదవి వహించినప్పటి నుంచి ప్రజల ప్రాధమిక అవసరాలను, అంటే తినేందుకు తిండి కట్టేందుకు వస్త్రాలు, తలదాచుకోడానికి ఇల్లు ప్రతివారికి ఏర్పడాలనే సంకల్పంతో పట్టుదలగా పని చేస్తున్నారు. అందుచేతనే ఏ పథకం గురించి ఆలోచించినా ఈ ఆశయాల సాధన ఆయన దృష్టిలో ఉంటుంది.

**తిరుమల-తిరుపతి దేవస్థాన ధర్మ కర్తృత్వ వ్యవస్థలో చెన్నారెడ్డి ప్రభుత్వం తెచ్చిన మార్పు ఇందుకు ఒక ఉదాహరణ భక్తిశ్రద్ధలతో యాత్రికులు స్వామికి సమర్పించే ధనం ప్రజోపయోగ కార్యక్రమాలకు ఉపయోగపడటం ఎట్టి పరిస్థితులలోనూ దుర్వినియోగం కాకుండా చూడటం లక్ష్యంగా ఎక్కువ మందికి ధర్మకర్తృత్వ వ్యవస్థలో అవకాశం కల్పిస్తూ ఈ మార్పులను అమలు జరిపారు.**

## భూమి పంపకం

భూమిలేని వారికి ఈ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచినంత భూమిని ఏ రాష్ట్రంలోనూ ఏ ప్రభుత్వమూ ఇంత స్వల్ప వ్యవధిలో పంచలేదు అనడం అతిశయోక్తి కాదు. మన రాష్ట్రావతరణానంతరం జరిగిన

అభివృద్ధిని పరిశీలించినప్పటికీ, డాక్టర్ చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించిన అనంతరం జరిగిన అభివృద్ధి అంతకు పూర్వం జరిగిన అభివృద్ధి కంటె మిన్న అని కూడా స్పష్టమవుతుంది.

పేద వారికి ఇళ్ళ స్థలాలు కేటాయించడమే కాకుండా వారి కోసం అధిక సంఖ్యలో ఇళ్ళు నిర్మించి ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన విధానం. బలహీనవర్గాల పట్ల ప్రభుత్వానికి కల ఆదరాభిమానాలకు ఈ సంక్షేమ కార్యక్రమాలే ప్రత్యక్ష నిదర్శనం కడచిన రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ఇచ్చిన సందేశంలో బడుగు వర్గాల పట్ల ఆయనకున్న అభిమానం, ఆదరణ, వాత్సల్యం వ్యక్తం అవుతున్నవి.

## "ప్రజలకు ఉపయోగించని ప్రణాళికలు నిరర్ధకం "

ప్రజలలో ఆశలు రేకెత్తించి భవిష్యత్తుపై వారికి ప్రగాఢ విశ్వాసాన్ని కల్పించడం కాకుండా, వారి జీవన విధానంలో గణనీయమైన మార్పు తేవడానికి, వారి పరిస్థితులు మెరుగు పరచడానికి కృషి చేయాలని ఈ ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉన్నది. ఎంతో గొప్ప ప్రణాళికలు వేసుకొని వాటిని సాధించినా, ఎంత పెద్ద ప్రాజెక్టులు నిర్మించినా, ఎన్ని భారీ పరిశ్రమలు స్థాపించినా అవి ఎవరికొరకైతే ఉద్దేశించబడినవో వారికి వాటి వలన ప్రయోజనం చేకూరకపోతే వాటి మనుగడే వృధా.

గతంలో అనేక కార్యక్రమాల వల్ల సంపన్నులకే ప్రయోజనం చేకూరిన సంఘటనలను గుణపాఠంగా తీసుకొని ఇంతవరకు నిర్లక్ష్యం చేయబడిన వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడే పెక్కు కార్యక్రమాలు మా ప్రభుత్వం చేపట్టింది. వాటిని దృఢ సంకల్పంతో అమలు జరుపుతుంది.

## బలహీన వర్గాలకై బహుముఖ పధకాలు:

రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలవారికి ఉద్యోగాలలో, విద్యా సంస్థలలో ఏర్పరచిన రిజర్వేషన్ సౌకర్యాన్ని మరో పది సంవత్సరాల పాటు పొడిగించడానికి డాక్టర్ చెన్నారెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీ సంస్థలలో కొన్ని స్థానాలను, బలహీన వర్గాల కోసం కేటాయించింది. వెనుకబడిన వర్గాలవారికి ఏమి కావాలో ప్రభుత్వం నిర్ణయించడమే కాకుండా వెనుకబడిన వర్గాల వారే తమ కోర్కెలను తాము స్పష్టంగా చెప్పడం కోసం ప్రత్యేకంగా మహాసభలు జరిపి వారి సమస్యలను పూర్తిగా పరిష్కరించడానికి చర్యలు తీసుకొన్నది.

హరిజనులు, గిరిజనులు, ఇతర బలహీన వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం, సంక్షేమంకోసం, రాష్ట్రంలో పెక్కు సంస్థలు పని చేస్తున్నాయి. విడిగా ప్రభుత్వ శాఖలు ఏర్పాటు అయ్యాయి. హరిజనులపై ఎక్కడైనా అత్యాచారాలు జరిగితే దోషులను శిక్షించడానికి సంచార న్యాయస్థానాలు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకొన్నది. పౌర హక్కుల చట్టాన్ని ఉల్లంఘించి అస్పృశ్యతను పాటించేవారిపైన తక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లకు, పోలీసు అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. మైనారిటి వర్గాలపట్ల కూడా ప్రభుత్వం ఎంతో ఆదరాభిమానాలు చూపిస్తున్నది. వారి పురోభివృద్ధి నిమిత్తం ఒక కమిషన్ ఏర్పాటు చేసింది.

## రైతాంగం సంక్షేమం :

రైతుల పట్ల ముఖ్యంగా పేద రైతుల పట్ల ప్రభుత్వానికి ప్రత్యేక శ్రద్ధ, ఆసక్తి ఉన్నాయి. సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ పరంగా సహాయ సహకారాలు అందించి, వారి సంక్షేమానికి పాటుపడాలని ప్రభుత్వ అభిమతం. రైతుల సమస్యల పట్ల ముఖ్యమంత్రి వైఖరికి ఒక ఉదాహరణ చెప్పవలసి ఉంది.

1979 ఫిబ్రవరి 1 వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సందర్శించినప్పుడు అక్కడి రైతులు తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.ముఖ్యమంత్రి అక్కడికక్కడే నిర్ణయాలు తీసుకొని రెవెన్యూ అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. ఇది రైతాంగానికి ఎంతో హర్షం కలిగించింది. ఇలాంటి సంఘటనలు మరెన్నో ఉన్నాయి. రైతాంగం సమస్యలను అవకాశం ఉన్నంతలో పరిష్కరించడానికి సాయశక్తులా ఆయన ప్రయత్నిస్తున్నారు. పేద రైతాంగం ఆయనను రైతు బాంధవుడని అభిమానిస్తున్నది. భీమవరం కళాశాలలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఇలా అన్నారు:" రైతుల సమస్యలు ప్రభుత్వానికి తెలుసు. వారిని ఆదుకొని, వారి

ఇబ్బందులను తొలగించేందుకు, వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నది."

1979 నవంబరు 21 వ తేదీన వ్యవసాయ పరిశ్రమల సంస్థ ఏర్పాటు చేసిన ఒక సభలో ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి ఇలా అన్నారు:

" గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోపాటు నిరుద్యోగులకు పెద్ద యెత్తున ఉపాధి కల్పించే పథకాలను ఈ సంస్థ చేపట్టాలి. వ్యవసాయదారుల ఉత్పత్తులపై పరిశోధన జరిపి వాటి నాణ్యతను అభివృద్ధి పరచి, వాటిని పంపిణీ చేసే విధానాన్ని, వాటి ద్వారా ఇతర ఉత్పత్తులను తయారు చేసే అనుబంధ పరిశ్రమలను నెలకొల్పే కార్యక్రమాన్ని ఈ కార్పోరేషన్ చేపట్టాలి. దాని వలన రైతులకు సరసమైన ధర గిట్టుబాటు అయ్యేటట్లు ఉత్పత్తులను వారు ఏ ఇబ్బందులు లేకుండా అమ్ముకునేందుకు ఈ సంస్థ కృషి చేయాలి. రైతుల శ్రేయస్సుకై ఉద్దేశించిన ఈ సంస్థపై అధిపత్యం రైతుల చేతుల్లోనే ఉండాలి. అభివృద్ధికి అవసరమైతే పెట్టుబడి పెట్టేందుకు రైతులు వెనుకాడరు. కనుక వ్యవసాయదారుల నుండి వారి శక్తిని దృష్టిలో పెట్టుకొని వాటా ధనం సేకరించటం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో రైతుల వద్ద ఉన్న మిగులు ధనాన్ని వారి ప్రయోజనానికి ఉపయోగించేందుకు కార్పొరేషన్ కృషి చేయాలి. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు రైతులకు ఈ సంస్థపై అధిపత్యం కల్పించేందుకు ప్రభుత్వం ఏ సహాయం కావలసినా అందిస్తుంది.

వినియోగదారులకు నష్టం కలగని పద్ధతిలో రైతు తాను ఉత్పత్తి చేసిన సరుకుకు గిట్టుబాటు ధర లభించేటట్లు చేయడం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం దేశంలో ఇతర ప్రాంతాల ధరల ప్రభావం మనపైన కూడా కొంత ఉంటుంది. అయినప్పటికి పంటను పండించే రైతుకు, పంటను అనుభవించేవినియోగదారుకు న్యాయం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం ఉపయోగపడుతున్నదని నిస్సందేహంగా చెప్పవచ్చు.

## రెవెన్యూ పాలనలో సంస్కరణలు :

సస్య విప్లవంతో పాటు రెవెన్యూ పాలనలో అపూర్వమైన మార్పులు వచ్చాయి. ప్రభుత్వ కార్యాలయాలకు రైతు పరుగులు తీయనవసరం లేకుండా ప్రభుత్వ సిబ్బందే రైతుల వద్దకు వెళ్లేటట్లు చేయడం డాక్టర్ చెన్నారెడ్డి అనుసరిస్తున్న విధానాల అంతర్యం. రైతుల పాస్ పుస్తకాల గురించి చాలా కాలంగా వినడమే కాని క్రియలో జరిగింది ఏమి లేదు. కాని, రాష్ట్రంలో కాంగ్రెస్ [ ఐ ] ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ విషయంలో నిర్దిష్టమైన చర్యలను తీసుకున్నారు. ప్రతి రైతుకూ తనకున్న భూమి వివరాలను తెలిపే పుస్తకాలను ఇచ్చే కార్యక్రమం ముమ్మరంగా అమలుజరుగుతున్నది. పాస్ పుస్తక పథకం రైతులకు గొప్ప వరం భూమి హక్కుల రికార్డు రైతుకు శ్రీరామ రక్ష. ఇంతేకాక, భూమిశిస్తు విధానంలో కొత్త దృక్పధానికి రాష్ట్ర ప్రభుత్వం నాంది పలుకుతున్నది.

చేనేత పనివారు, ఇంకా ఇతర చేతి వృత్తులవారు, మత్స్య, గీత పారిశ్రామికులు తదితర బలహీన వర్గాల కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు జరుపుతున్నది. 1979 మే 17 వ తేదీన కాకినాడ సందర్శించినప్పుడు ముఖ్యమంత్రి అక్కడి మత్స్య పారిశ్రామికుల స్థితిగతులను పరిశీలించి అక్కడికక్కడే సహాయ చర్యలను ప్రకటించారు. కొంత మంది మత్స్య పారిశ్రామికులకు కాకినాడ రేవులో శిక్షణ ఇవ్వాలని అధికారిలను ఆదేశించారు.

## విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సాధనకై కృషి :

రాష్ట్రం సుసంపన్నం కావడానికి, తలసరి ఆదాయం పెరగడానికి, ఉద్యోగావకాశాల మెరుగుదలకు పారిశ్రామికీకరణ తప్పనిసరి. అందువల్లనే డాక్టర్ చెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసిన తరువాత పట్టుదలగా విశాఖపట్టణం ఉక్కు కర్మాగారం కోసం పనిచేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో దానిని సాధించి తెలుగు ప్రజల చిరకాల వాంచను నెరవేర్చారు.ఇంత వరకు మన రాష్ట్రంలో నెలకొన్న పరిశ్రమలన్నీ ఒక ఎత్తు కాగా,సోవియట్ యూనియన్ సహకారంతో విశాఖపట్టణం వద్ద ఏర్పడుతున్న ఉక్కు కర్మాగారం మరొక ఎత్తు. ఇంతేగాక ఒరిస్సా, ఆంధ్ర సరిహద్దు సమీపంలో ఒక అల్యుమినియం కర్మాగారం కూడా సోవియట్ యూనియన్ సహకారంతో ఏర్పడబోతున్నది. రామగుండం ఎరువుల కర్మాగారంలో ప్రయోగాత్మకంగా యూరియా ఉత్పత్తి ఇటీవలే ప్రారంభం అయింది.

## పారిశ్రామికాభివృద్ధి :

ప్రభుత్వ రంగంలోనే కాక ప్రైవేటు రంగంలో కూడా పరిశ్రమలను అభివృద్ధి పరచడానికి డాక్టర్ చెన్నారెడ్డి ప్రభుత్వం కృషి చేస్తున్నది. ఇతర రాష్ట్రాలకు చెందిన పారిశ్రామికులకు కూడా ఎన్నో సదుపాయాలు కల్పించి మన రాష్ట్ర సత్వర పారిశ్రామికీకరణకు దోహదం చేస్తున్నది.చిన్న తరహా పరిశ్రమల రంగంలో మన రాష్ట్రం ఇటీవల శీఘ్రతర అభివృద్ధిని సాధించడం మరొక విశేషం. ప్రభుత్వ ఆధ్వర్యాన పెక్కు సహాయక సంస్థలు ఏర్పడి ఉత్సాహవంతంగా పని చేస్తున్నాయి 1956 సంవత్సరంలో మన రాష్ట్రంలో కేవలం 12 వందల చిన్న తరహా పారిశ్రామిక యూనిట్లు మాత్రమే ఉండగా, ఈనాడు అవి 22 వేల వరకు పెరగడం మనందరికీ గర్వకారణం.

## వైద్య సౌకర్యాలు :

వైద్య రంగంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు మొదలైనాయి .వివిధ పట్టణాలలోని ఆసుపత్రులలో పడకల సంఖ్యను పెంచడానికి,ఇతోధికంగా సౌకర్యాలు కల్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు వైద్య సదుపాయాలు కల్పించడానికి ఇటీవల ప్రభుత్వం గణనీయంగా కృషి చేసింది.హైదరాబాదులో ఒకప్పుడు నిజాం నవాబు నివసించిన రాజప్రాసాదంలో ఆధునిక సౌకర్యాలు కలిగిన ఆసుపత్రిని నెలకొల్పడానికి డాక్టర్ రెడ్డి చేసిన ప్రయత్నం కొంత ఫలించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలనుకున్న ఈ భవన సముదాయం ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వపరమై ప్రజావసరాలను తీర్చడానికి ఉపయోగపడుతున్నది ఇది మనందరికీ హర్షదాయకమైన విషయం.

## విద్యారంగంలో కొత్త విధానం :

విద్యారంగానికి సంబంధించి డాక్టర్ చెన్నారెడ్డి గారు, రూపొందించిన నూతన విధానం జాతీయ స్థాయిలో అందరి మన్ననలను పొందింది. ప్రాథమిక దశలోనే విద్యార్థులలో నైతిక విలువలను, క్రమశిక్షణను , దేశభక్తిని పెంపొదించేందుకు ఆయన తలపెట్టిన నూతన విధానం అభ్యుదయ విద్యావిధానంగా ప్రసిద్ధి చెందింది. అభ్యుదయ పాఠశాలల్లో యోగవిద్యవంటి కార్యక్రమాలు అమలు జరపడం యువతరంలో నవచైతన్యానికి నాంది పలికింది

.

మన విద్యా విధానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అతి ముఖ్యమైన మరొక మార్పు వృత్తికి, జీవనోపాధికి ఉపయోగపడే విద్యను బోధించడం. సాధారణ విద్యతో జోడించి ఈ వృత్తి విద్యాశిక్షణను పెంపొందించాలని డాక్టర్ చెన్నారెడ్డి సంకల్పం.

ప్రతి బాలుడిని, బాలికను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటం మన విద్యా విధాన కర్తవ్యం కాగా, ప్రజలందరిలో నైతిక ప్రమాణాలను పెంపొందించడానికి కూడా డాక్టర్ చెన్నారెడ్డి కృషి చేస్తున్నారు. ఆస్తిక ప్రజల సౌకార్యార్థం దేవాలయాలను పునరుద్ధరించాలని, దేవాలయాల నిధులు మన సంస్కృతీ వికాసానికి, విద్యాభివృద్ధికి, నైతిక స్థాయి పెరగడానికి ఉపయోగపడాలని డాక్టర్ చెన్నారెడ్డి అభిమతం. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు తదనుగుణంగా రూపుదాలుస్తున్నాయి. రామాయణ, భారతాది గ్రంథాలను చౌకగా ప్రజలకు అందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి :

రాష్ట్రంలో చలన చిత్ర పరిశ్రమాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలిస్తున్నాయి. చలన చిత్రాలకు పెట్టుబడులు సమకూర్చే సంస్థకు ఇటీవలే ఎక్కువ నిధులను మంజూరు చేయడం, చలన చిత్ర పరిశ్రమకు సంబంధించిన వారు హైదరాబాదులో స్థిరపడటానికి ఇతోధికంగా సౌకర్యాలు కల్పించడం అందరికీ తెలిసిన

విషయాలే. వచ్చే కొద్ది సంవత్సరాలలో మద్రాసు కంటే హైదరాబాద్ నగరం చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి దృష్ట్యా సమధిక ప్రాముఖ్యం వహిస్తే అది నేడు మన రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల చలవే.

## గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు

:

రాష్ట్ర ప్రభుత్వం, సగర్వంగా చెప్పుకోతగిన విజయాలలో ఒకటి ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించే పథకం. రవాణా సౌకర్యాలు పెంపొందితే కాని మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడదని భావించి డాక్టర్ చెన్నారెడ్డి ఈ కార్యక్రమానికి రూప కల్పన చేశారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా పథకానికి కార్య రూపం ఇచ్చారు. మారుమూల గ్రామాలకు సయితం బస్సులు వెళ్లడమే కాక, ఈ పథకం వల్ల జరిగిన మరొక మేలు గ్రామీణ ప్రాంతాలలో రోడ్డు సౌకర్యాలు త్వరితగతిని మెరుగు పడడం. కడచిన రెండు సంవత్సరాలలో అసంఖ్యాకంగా బస్సు డిపోలు ఏర్పడ్డాయి. కొత్త మార్గాలలో బస్సులు నడుస్తున్నాయి.

గ్రామీణ ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం లక్ష్యంగా ఇటీవలి సరుకుల రవాణాకు ఆర్. టి. సి. సర్వీసులను ఉపయోగించే పథకాన్ని కూడా అమలులోకి తెచ్చారు.

రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాన్ని శీఘ్రతరం చేయడానికి కూడా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది,నాగార్జునసాగర్ ఎడమ కాలువ నిర్మాణం ఇటీవలే పూర్తి కావడం మనందరికీ తెలుసు. ఖమ్మం జిల్లాలో వేలాది ఎకరాలకు ఇప్పుడు నీటి పారుదల సౌకర్యం ఏర్పడింది. ఇలాగే పోచంపాడు ప్రాజెక్టు క్రింద కాలువల నిర్మాణాన్ని వేగిర పరచడానికి కూడా ప్రభుత్వం పూనుకొన్నది.

## విద్యుచ్ఛక్తి రంగంలో విశేషాభివృద్ధి :

విద్యుచ్ఛక్తి వాడకం మన రాష్ట్రంలో వెయ్యి మెగావాట్ల స్థాయిని దాటడం రాష్ట్రాభివృద్ధికి మరొక నిదర్శనం. వర్షాభావంవల్ల రిజర్వాయర్లలో నీటి మట్టం తగ్గి జల విద్యుత్తు ఉత్పాదన ఒకింత తగ్గినప్పటికి పరిశ్రమలకు ఇబ్బంది కలగకుండా చేయడానికి. వాడకం దారులకు అసౌకర్యం ఏర్పడకుండా చేయడానికి ప్రభుత్వం చేయవలసిన కృషి యావత్తు చేస్తున్నది. త్వరలోనే మన విద్యుదుత్పాదన ఇంకా పెరిగి ఇరుగుపొరుగు రాష్ట్రలకు కూడా విద్యుచ్ఛక్తి సహాయం చేయగల స్థితిలో ఉంటాము.

## శ్వేత విప్లవం :

మన రాష్ట్రంలో " శ్వేత విప్లవం " రైతాంగానికి ఎంతగానో ఉపయోగపడింది. గ్రామీణులు పాడి పరిశ్రమ ద్వారా తమ ఆదాయాన్ని అభివృద్ధి చేసుకున్నారు. పేద గిరిజనులకు సహితం ప్రభుత్వం గేదెలను సరఫరా చేసి వారి ఆదాయాన్ని పెంచడానికి తోడ్పడింది. రాష్ట్రంలో ఇప్పటి పాల ఉత్పత్తి వివరాలను పరిశీలిస్తే కొన్ని సంత్సరాల క్రిందటి అంకెలకు పోలికే లేనంతగా అభివృద్ధి కనిపిస్తున్నది.

## మంచి నీటి కొరత నివారణ కృషి :

గ్రామీణులు అనుభవించే ఇబ్బందులలో అతి ముఖ్యమైనది మంచినీటి ఎద్దడి. త్రాగే నీటి కోసం మైళ్ళ దూరం వెళ్లవలసిన పరిస్థితి తప్పించాలని, శాశ్వతంగా ఈ సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి దీక్ష ఉన్నది. అందుకే వెయ్యి కోట్ల రూపాయలు ఖర్చు అయ్యే ఒక బృహత్ పథకాన్ని డాక్టర్ చెన్నారెడ్డి మంత్రివర్గం రూపొందించింది.

గ్రామాల నుంచి పట్టణాలకు వలస కొనసాగుతుండటం వల్ల విశ్వవిద్యాలయాల నుంచి పట్టభద్రులై వస్తున్న యువకుల సంఖ్య పెరుగుతుండటం వల్ల మరింతగా ఉపాధి అవకాశాలను కల్పించ వలసిన అవసరం ఏర్పడింది. ఈ అవసరాన్ని గుర్తించి డాక్టర్. చెన్నారెడ్డి యుద్ధ ప్రాతిపదికపై ప్రత్యేక కార్యక్రమాలు అమలు జరపడానికి ఆదేశించారు.ఉద్యోగ కల్పన విషయంలో ఆయన కొత్త పద్ధతులను ప్రవేశపెట్టారు. ఒక ప్రత్యేక అధికారి ఉపాధి

అవకాశాల విస్తరణ నిమిత్తం నియమితులైనారు ప్రతి శాఖను ఎప్పటి కప్పుడు సంప్రదిస్తూ ఉద్యోగావకాశాలను పెంపొందించడం ప్రత్యేక అధికారి కర్తవ్యం.

ఇంతకు ముందే పేర్కొన్నట్టు, రాష్ట్రాభివృద్ధి కృషిలో అందరి సహకారాన్ని అందుకొనడానికి ప్రయత్నించి ముఖ్యమంత్రి ఉత్తమ కార్యశీలి అని నిరూపించుకొన్నారు. అందరూ సదవగాహనతో పనిచేయాలని ఆయన ఆకాంక్ష. 1979 జనవరి 21 వ తేదీన జూబిలీ హాలులో జరిగిన సభలో మాట్లాడుతూ " ప్రజలకు సేవచేయడంలో ప్రజాపతినిధులు, అధికారుల మధ్య సదవగాహన, సుహృద్భావం ఉండాలని నేను మరొకసారి నొక్కి చెబుతున్నాను " అన్నారాయన.

1979 మార్చి 16 వ తేదీన శాసనసభలో ప్రసగింస్తూ తమ అభిప్రాయాన్ని ఈ విధంగా వెల్లడించారు " సమీష్టి గా రాష్ట్ర బాధ్యతను నిర్వహించే బాధ్యత మనందరిపైన ఉన్నది, నేను అందరితోను కలసి వీలైనంతవరకు దేశానికి ఉపయోగపడే పని చేయడానికి ప్రయత్నిస్తారు. జనం మధ్యలో ఉండాలని, ఉండి పెరగాలని, పెరిగి మీరూ మేమూ కలసి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్ష ఉంది ".

అందరి అభిప్రాయాలను సేకరించి అందులోని మంచి గుర్తించే విశాల దృక్పథం డాక్టర్ చెన్నారెడ్డి లో మెండుగా కనిపిస్తుంది. ఇది ఆయన తన ప్రసంగాలలో అనేక పర్యయాలు స్పష్టం చేశారు.

ఒక సందర్భంలో ఆయన ఉలా అన్నారు: " హిందువులు అయినా, క్రైస్తవులు అయినా, ముస్లిములు అయినా, ఏ మతంలోని పెద్దలనైనా నేను గుర్తిస్తాను. ప్రతి వ్యక్తికి మత స్వేచ్ఛ ఉన్నది దానిని నేను పాటిస్తాను.

**శాంతి భద్రతలు :**

గత రెండున్నర సంవత్సరాల పాటు కేంద్రంలోని ప్రభుత్వం అసమర్థతవల్ల దేశంలో అశాంతి, అలజడి పెరిగింది దాని ప్రభావం మన రాష్ట్రంలో కూడా కొంత ఉంది. అయితే శాంతిభద్రతలను పరిరక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత శ్రద్ధ వహిస్తున్నది. ఈ కృషి ఫలితంగా ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఎంతో మెరుగుగా ఉంది ఇంతకంటె పరిస్థితిని మరింత మెరుగు పరచాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. మేడ్చల్ లో జరిగిన ఒక సభలో మాట్లాడుతూ డాక్టర్ చెన్నారెడ్డి ఇలా అన్నారు

" సమాజ ప్రయోజనాలకు హాని కలిగించే, శాంతిభద్రతలకు భంగం కలిగించే సంఘ విద్రోహ శక్తులను అరికట్టి, శాంతికాముక ప్రజలకు రక్షణ కల్పించడానికి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది శాంతి భద్రతల ద్వారానే ప్రగతి సాధ్యపడగలదనే విషయం ఏ ఒక్కరూ విస్మరించరాదు. శాంతిభద్రతల పరిరక్షణకు, హింసా విధానాన్ని వ్యతిరేకించడానికి అన్ని పార్టీల సహకారం స్వీకరించడానికి మా ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధమే '.

## ప్రభుత్వోద్యోగులు నా కుటుంబ సభ్యులు

ఏ ప్రభుత్వమైనా ప్రజలకు సేవ చేయాలంటే అది అధికార సిబ్బంది పరంగానే జరగాలి. అధికార సిబ్బందిలో అసంతృప్తిని తొలగించి వారి కష్టనిష్ఠురాలను పరిష్కరించి, ప్రభుత్వ యంత్రాంగం ప్రజా సేవకు అంకితమై ఉండాలని డాక్టర్ చెన్నారెడ్డి అభిమతం అందుకే వేతనాల సవరింపు కమిషన్ ఇచ్చిన నివేదికను సంపూర్ణంగా ఆమోదించి, భారమైనప్పటికి ఖర్చును భరించడానికి అంగీకరించి ప్రభుత్వ ఉద్యోగులందరికీ మేలు చేశారు డాక్టర్ చెన్నారెడ్డి, ఆయన దృష్టి లో ప్రభుత్వ ఉద్యోగులు ఆయన కుటుంబ సభ్యులే. మార్చి 15 వ తేదీన శాసనసభలో ప్రసంగిస్తూ ఆయన " నేను ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం వారందరిని [ ప్రభుత్వ ఉద్యోగులను ] నా పిల్లలుగా చూస్తాను. నా కుటుంబంలో సభ్యులుగా పరిగణిస్తాను. ఈ కుటుంబానికి పెద్దగా ఉండటం నాకు మీరు ఇచ్చిన గౌరవం ".

## ప్రజల భాషలో పరిపాలన

ప్రజల భాషలో పరిపాలన జరిగితేనే ప్రజలకు సంతృప్తి కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం గురించి, ఈ లక్ష్యాన్ని త్వరగా సాధించడానికి చర్యలు తీసుకుంటున్నది, ఈ విషయమై ముఖ్యమంత్రి తన అభిప్రాయాలను ఒకసారి ఇలా వివరించారు.

" పరిపాలనను పూర్తిగా వికేంద్రీకరించి దానిని క్రింది గ్రామ స్థాయికి తీసుకు వెళ్ళాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. వికేంద్రీకృత పద్ధతిలో ఒక స్థాయి పరిపాలన గ్రామాలకు పరిమితం చేసినప్పుడు సహజంగా స్థానిక భాషలకు ప్రాధాన్యత లభించి, ఆ భాషలోనే పరిపాలనా వ్యవహారాలు కొనసాగుతాయి. దైనందిన పరిపాలన తెలుగులోనే కొనసాగాలన్నది, అది ప్రజలకు అత్యంత సన్నిహితంగా ఉండాలన్నది ఈ ప్రభుత్వ ఉద్దేశం అందువల్లనే ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలనను వికేంద్రీకరించడం ద్వారా తెలుగు ఉపయోగాన్ని పాలనా వ్యవహారాల్లో ఇనుమడింపజేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉన్నది".

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇప్పుడు లభిస్తున్న జీతభత్యాలు కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ఆ మాటకువస్తే మరే ఇతర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలకు తీసిపోవు. 55 సంవత్సరాలకే రిటైరై జీవితాన్ని భారంగా గడపవలసి వచ్చే ప్రభుత్వ ఉద్యోగిలకు రిటైర్ మెంట్ వయస్సును పెంచి వేలాది కుటుంబాలకు మరువరాని మేలు చేసింది ఇప్పటి ప్రభుత్వమే. ఉద్యోగుల కుటుంబాలకు మేలు జరగడమే గాక ఈ చర్యవల్ల ఉద్యోగుల పరిపాలనానుభవం రాష్ట్ర ప్రజలకు మరింతగా ఉపయోగపడుతున్నదికూడా.

## పత్రికల పట్ల గౌరవం

పత్రికల పట్ల ముఖ్యమంత్రికి గౌరవం ఉంధి. పత్రికా సిబ్బంది పట్ల అభిమానం ఉంధి ప్రత్యేకించి చిన్న పత్రికల అభివృద్ధికి దోహదం చేయాలని ఆయనకు సత్సంకల్పం ఉంది 1979 జనవరి 21 వ తేదీన " సమాచార్ భారతి " వార్తా సంస్థకు ప్రారంభోత్సవం చేస్తూ ఆయన ఇల అన్నారు:

బలహీన వర్గాలకు ప్రత్యేక సహాయం చేస్తున్నట్టే చిన్న పత్రికలకు కూడా సహాయం చేయవలసి ఉంధి పత్రికలు నిష్పక్ష పాతంగా, నిర్భయంగా తమ బాధ్యతలు నిర్వహించినప్పుడే ప్రజాస్వామ్యం అర్ధవంతం ఔతుంది."

ప్రజల ఆశలను, ఆశయాలను గుర్తెరిగి వారి సమస్యలను సాకుల్యంగా అవగాహన చేసుకొని, రాష్ట్ర స్థితిగతులనూ, వర్తమాన దీర్ఘకాల అవసరాలను ఆకళింపు చేసుకున్న జనహిత ముఖ్యమంత్రి డాక్టర్ చెన్నారెడ్డి గారు ప్రజాభ్యుదయం కోసం, రాష్ట్ర ప్రగతి కోసం నిర్విరామంగా శ్రమిస్తున్నారు. ప్రతి ప్రాంతానికి వెళ్ళి ప్రజలను కలుసుకొని, వారి సాధకబాధకాలు తెలుసుకొని పరిష్కర చర్యలు తీసుకుంటున్నారు. ఎన్ని పర్యటనలు చేయవలసి వచ్చినప్పటికి బరువూ బాధ్యతలతో కూడిన పరిపాలన వ్యవహారాలను ఎలాంటి జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నారు.

బడ్జెట్ సమావేశం సందర్భంగా 1979 మార్చి 16 న శాసనసభలో ముఖ్యమంత్రి చెప్పిన మాటలు గమనార్హమైనవి " రాత్రి ఎంతసేపైనా ఫైళు చూస్తాను. ఇక్కడ కూడా ఎంతోమంది ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా మాట్లాడుతూ ఉండే ఉపన్యాసాలు ఇస్తూ ఉంటే నేను నాసీట్లో ఫైళు చూసుకుంటూ ఉండటం మీ కందరికి తెలుసు. అంటే ఉపన్యాసం విననని కాదు. వింటూనే ఫైళ్ళు చూసుకునే అలవాటు నాది".

## నాలుగు దశాబ్దాల రాజకీయానుభవం :

నాలుగు దశాబ్దాలుగా రాజకీయోద్యమాలలో కాకలు తిరిన యోధుడై, జాతీయ స్థాయి వరకు ఎదిగి, ఎంతో విలువైన పరిపాలననుభం అర్జించిన మన ముఖ్యమంత్రి కార్యదీక్ష, అభ్యుదయ దృక్పధం నేతృత్వ సామర్ధ్యం ప్రజా సక్షేమానికి, రాష్ట్రం సుసంపన్నం కావడానికి ఉపయోగపడుతున్నాయి. ఆయన ముఖ్యమంత్రి పదవి వహించిన ఈ స్వల్ప కాలంలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను సాధించిన విజయాలను సిం హావలోకనం చేయడం చిరు పుస్తకం ఈ ప్రచురణోద్దేశం.

ప్రజలకు ప్రయోజనం కలిగినప్పుడే పాలకులు రూపొందించే పథకాలకు కార్యరూపమివ్వడం ప్రజలకు సద్య ఫలితాలను సమకూర్చే పనులను చేపట్టడం రాష్ట్ర భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చి దిద్దే పథకాలను రూపొందించడం డాక్టర్ చెన్నారెడ్డి ఈ స్వల్ప వ్యవధిలో అనుసరించిన విధానం. ఆయన ఆలోచనా వైఖరి క్రియాశీల విధానం ఆయన పార్టీ ప్రభుత్వం ప్రతిష్ఠను ఇనుమడింప చేయడమే కాక, శ్రీమతి ఇందిరాగాంధి యశస్సుకు వన్నె చేకూరుస్తున్నాయి.

ఈ రాష్ట్రంలో ఇందిరా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేస్తున్నదో ప్రభుత్వ రధసారధి డాక్టర్ చెన్నారెడ్డి నిర్వహించిన నిర్వహిస్తున్న, నిర్వహించనున్న బాధ్యతలు ఎలాంటివో ప్రజలకు తెలియనివికావు ఈ ప్రభుత్వంపై ఆశలు నిలుపుకుని,సుందర స్వప్నాలు కంటున్న ప్రజలకు ఈ ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించడం ఆ పార్టీ కార్యకర్తలదేకాక అందరి బాధ్యత

## డాక్టరుగారు

ఆయన ఆవేశపరుడే కావచ్చు; కాని అంతకు మించిన ఆలోచనా పరుడు కూడా.

ఆయన అందోళనకారుడే కావచ్చు; కాని, అంతకు మించిన పరిపాలనా దక్షుడూ.

ఆయన పలుకు ఒక్కొక్కప్పుడు ములుకుగా కనిపించవచ్చు; కాని, ఆయన మనస్సు నవనీత సదృశం.

ఆయన ఒక్కొక్కప్పుడు కోపిష్ఠిగా కనిపించవచ్చు; కాని, గర్విష్ఠి మాత్రం కాదు. ఆ కోపమైనా, తాను ప్రజలకు మంచి దనుకొన్న పని కానప్పుడు కలిగే తాపమే: త్వరగా పని కావాలన్న తన తపనను ఇతరులు గుర్తించచేదన్న తాపత్రయమే.

ఇవి పరస్పర విరుద్ధమైన గుణాలు కావచ్చు, కాని, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి లోని ప్రత్యేకత అదే; ఆయన విశిష్టత కూడా అదే.

పట్టుదలకు ఆయన పెట్టింది పేరు. తాను అనుకొనంది సాధించవలసిందే. తాను ఆశించింది అందుకొనవలసిందే. అది చిన్ననాటినుండి ఆయనకు వెన్నతో పెట్టిన విద్య.

యెదమెచ్చుల కోసం మాట్లాడడు. ముక్కుకు సూటిగా మాట్లాడడం స్వభావం.

తనను నమ్ముకున్న వారిని నట్టేట ముంచడం ఆయన నెత్తురులోనే లేదు. మాటకారి అయినా మాటకు "మారు మనువు" పనికి రాదంటాడు. ఆడిన మాటకు అతుక్కుని ఉండటం రాజకీయ వేత్తలకు సాధారణంగా అలవాటు లేకపోయినా, చెప్పింది చేయడమే చెన్నారెడ్డి ప్రత్యేకత. చేసేది ఒక్కొక్కప్పుడు చెప్పకుండా చేయడం కూడా ఆయన మిత్రులకు అనుభవమే.

తన పరిచితులందరిలోని ప్రతిభను పసిగట్టగల " మీటరు" ఏదో ఈ " డాక్టరు " లో వుంది అందువల్ల, ఎవరు ఏ పనికి వస్తారో ఆయనకు బాగా తెలుసు. వారి ప్రతిభను ఎప్పుడు, ఎలా వినియోగించుకోవాలో కూడా ఆయనకు బాగా తెలుసు.

శివభక్తుడు కావటంవల్ల ఆ " భోళా శంకరుని " లోని భోళాతనం కూడా ఆయనలో కానవస్తుంది. భోళాతనమే కాని అది బేల తనం కాదు.

తనను నయవంచన చేయదలచుకున్న వారిని ఆయన ఇట్టే పసిగట్టగలడు. వంగి వంగి నమస్కారాలు చేసే వారిని ఒక కంట కనిపెట్టగలడు

---

డా. చెన్నారెడ్డి గొప్ప పరిపాలనాదక్షుడు. రాజకీయ సామాజిక, సాంస్కృతిక రంగాలలో ఆయన ప్రశంసనీయమైన సేవ చేశారు. ఎవరు ఎక్కడ, ఎప్పుడు ఏ మంచి కార్యక్రమం తలపెట్టినా, దానికి ప్రోత్సాహం, సహకారం అందించడానికి డా. రెడ్డి ఎల్లప్పుడూ సిద్ధమే.

[ వి. వి. గిరి ]

అన్నింటిని మించి అపారమైన జ్ఞాపక శక్తి ఆయన సొత్తు, ఇది రాజకీయవేత్తలకు, పరిపాలకులకు ఆస్తి. ఒకసారి విన్న విషయాన్ని, ఒకసారి కాంచిన వ్యక్తిని ఆయన మరచిపోరు. అందుకే ఆయన ఒకసారి పరిచయమైన వారిని రెండవసారి పేరుతో పలకరించగలుగుతారు. ఊరూర వున్న వందలాది కాంగ్రెస్ కార్యకర్తలను పేరు పెట్టి పలకరించడం ఆయన ప్రత్యేకత. ఆయన రాజకీయవేత్తగా, పరిపాలనాదక్షుడుగా రాణించడానికి ఆయనకు ప్రకృతి ప్రసాదించిన ఈ విశేషం ఒక వరప్రసాదం. ఇంతటి జ్ఞాపకశక్తిగల రాజకీయవేత్తలను భారతదేశంలోనే వ్రేళ్ళపై లెక్కించవచ్చునేమో.

## సవ్యసాచి

డాక్టర్ చెన్నారెడ్డి బహుభాషావేత్త. తెలుగులోను ఇంగ్లీషు లోను, ఉర్దూలోను ఆయన గొప్ప వక్త. ఈ భాషలలో దేనిలో నైనా గంటల తరబడి శ్రోతలను వుర్రూతలూగిస్తూ ఉపన్యసించగల నేర్పరి. ఉర్దూలోను, హిందీలోను మహూపన్యాసకుడు కావడం. వల్ల ఆయన ఉత్తరాది వారికి ఉత్తరాది నాయకులకు ఇష్టుడు. ఉత్తరాది వారినే ఒక్సారి ఆయన తన ఉర్దూ వచో విభవంతోనిరిత్తరులను చేశాడు, మరాఠా, కన్నడ, తమిళ భాషలు కూడ ఆయన అర్థం చేసుకోగలరు.

---

డా. చెన్నారెడ్డి గొప్ప దేశభక్తుడు, ఆధునిక భారతావనిలో ప్రముఖ నాయకుడు.

[ టి. ఎస్. గిల్, గోవా, దామన్ డయ్యూ లెఫ్టినెంట్ గవర్నరు ]

## అక్కడికక్కడే. . .

శ్రీ చెన్నారెడ్డిలో మరొక ప్రత్యేకత వున్నది. అక్కడికక్కడే, అప్పటికప్పుడే నిర్ణయాలు చేయడం ఆయన ప్రత్యేకత. ఆయన ముఖ్యమంత్రిగా వచ్చిన తరవాత ఇట్టి నిర్ణయా లెన్నింటినో చేశారు. అంతే కాదు--- వారం వారం మంత్రివర్గ సమావేశం జరగాలని ఆయన ముఖ్యమంత్రి కాగానే నిర్ణయించారు. మంత్రివర్గ సమావేశం రోజు వస్తుందంటే చాలు--- ఏమి నిర్ణయం వస్తుందోనని ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం ఆతురతతో ఎదురు చూస్తూ ఉంటారు.

అప్పటికప్పుడు --- అక్కడికక్కడే నిర్ణయాలు చేయడం ఆధునిక భారతీయ పరిపాలకులలో ' ఆంధ్ర కేసరి " శ్రీ టంగుటూరి ప్రకాశం గారితో ప్రారంభమైంది.

శ్రీ చెన్నారెడ్డి అధికారంలోకి వచ్చిన తరవాత ఎన్నో ' స్పాట్ డేసిషన్స్ " తీసుకున్నారు.
సమస్యను ఇట్టే అకళింపు చేసుకోవడం, దాన్ని గురించి అప్పటికప్పుడు అన్ని దృక్కోణాల నుంచి ఆలోచించడం, వెంటనే నిర్ణయం చేయడం, చేసిన నిర్ణయాన్ని అమలు పరచడం. ఆయన ప్రత్యేకత.

గొప్ప మేధావి, ప్రతిభ గల నాయకుడైన డా. చెన్నారెడ్డి వివిధ పదవుల ద్వారా దేశానికి అమూల్యమైన సేవ చేశరు.

[ బిదేశ్ కులకర్ణీ - పాండిచెర్రి లెఫ్టినెంట్ గవర్నరు ]

---

## బహుముఖ ప్రజ్ఞాశాలి :

డాక్టర్ చెన్నారెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి. తమకు వచ్చిన లేఖలను స్వయంగా చదువుకొని సమాధానాలు వ్రాసే వాడే పరిపాలకుడూగా రాణించగలడని ఒకసారి డాక్టర్ పట్టాభి అన్నారు. ఇది మన డాక్టర్ గారికి బాగా వర్తిస్తుంది ఆయన తనకు వచ్చే ఉత్తరాలన్నింటిని స్వయంగా చదువుకుంటారు. వాటికి స్వయంగా సమాధానాలు వ్రాస్తారు.

బహిరంగ సభలలో, సమావేశాలలో పాల్గోన్నప్పుడు కూడా తన అధికార బాధ్యతలకు సంబంధించిన ఫైళ్లను చూడటం, వాటిపై ఉత్తర్వులను జారీ చేయడం ఆయన ప్రత్యేకత. అయితే, అదే సమయంలో సభలో మాట్లాడే ఉపన్యాసకుల ప్రసంగాలను కూడా శ్రద్ధగా విని వాటికి తరవాత తమ ఉపన్యాసంలో సమాధాన మివ్వడం ఆయన అవధాన శక్తికి నిదర్శనం.

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి క్రీడాకారుడు, ఫుట్ బాల్, గోల్ఫ్ మున్నగు క్రీడలలో ఆయన ప్రవీణుడు. యు.పి. గవర్నర్ గా ఉన్నప్పుడు ఆనాటి రాష్ట్రపతి, గోల్ఫ్ క్రీడాకారుడు అయిన శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహమ్మద్ తో ఆయన గోల్ఫ్ ఆడారు.

---

సమర్ధవంతుడైన డా. చెన్నారెడ్డి గడచిన కొన్ని దశాబ్దాలుగా దేశాభివృద్ధిలో ప్రముఖ పాత్ర వహిస్తున్నారు.

[ బి. బి. లాల్ - సిక్కిం గవర్నరు ]

---

డాక్టరు రెడ్డికి యోగాభ్యాసం పట్ల కూడా ఆసక్తి మెండు ఆయనకు జోతిష్యంపట్ల విశ్వాసం వుంది. అన్నింటిని మించి ఆయన గొప్ప దైవభక్తుడు. యు. పి. గవర్నర్ గా వున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి గా వున్న ఆయన దేవాలయాలను సందర్శించడం, దైవ పూజ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆయన నిత్య విధులలో ఒకటి. అన్నట్టు ఆయన గురపుస్వారి కూడా చేస్తారు అందువల్లనే కాబోలు తన పరిపాలనా యంత్రాంగం కూడా అశ్వవేగంతో పరుగిడాలని ఆయన కోరుతారు.

డాక్టర్ చెన్నారెడ్డి 1919 జనవరి 13 వ తేదీన ఆనాటి హైదరాబాద్ సంస్థానంలోని అత్రాఫ్ బల్దా జిల్లాలోని సిరిపురం గ్రామంలో జన్మించారు. తండ్రి పేరు శ్రీ లక్ష్మారెడ్డి, తల్లి పేరు శ్రీమతి శంకరమ్మ తల్లిదండ్రులకు ఆయన ఏకైక పుత్రుడు.

చిన్ననాటి నుండి ఆయన ఏక సంధాగ్రాహి. బాల్యం నుండి ఆయన సంస్థా నిర్మాణ దక్షుడు, తొమ్మిది సంవత్సరాల వయస్సు లోనే యువజన వక్తృత్వ సంఘాన్ని స్థాపించి, యువకులకు విజ్ఞానాన్ని, వక్తృత్వాన్ని అలవరచడానికి ఆయన కృషి చేశారు. అందువల్లనే కాబోలు ఆయన మూడు, నాలుగు భాషలలో వక్తగా భాసిల్లుతున్నారు. రాజకీయ చైతన్య వ్యాప్తిలోను, ప్రజలలో విజ్ఞాన ప్రచారంలోను గ్రంధాలయాలు నిర్వహించగల

పాత్రను ఆనాడే ఆయన గుర్తించి, తమ యువజన సంఘం ఆధ్వర్యాన వసూలు చేసిన విరాళాలతో ఒక గ్రంధాలయాన్ని నెలకొల్పారు.

---

డా. చెన్నారెడ్డి వివిధ పదవులు సమర్ధనీయంగా నిర్వహించి, రాష్ట్రానికి - దేశానికి గణనీయమైన సేవ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన ప్రజలకు మార్గదర్శకులైనారు. పేదలు అట్టడుగు వర్గాల అభ్యున్నతికి డా. రెడ్డి కట్టుకున్న దీక్షా కంకణం - ప్రేరణకు మూలం.

[ దేవరాజ్ అర్స్ ]

---

## నాటకంలో స్త్రీ పాత్ర :

బాల్యంలోనే డాక్టరు గారికి సాంస్కృతిక కార్యకలాపాలపట్ల ఆసక్తి ఏర్పడింది. ఈనాడు నాటక కళ, చలనచిత్ర కళలపట్ల ఆయనకుగల అపారమైన ఆసక్తికి శ్రద్ధాసక్తులకు ఆనాడే పునాదులు పడ్డాయి. చిన్నప్పుడు ఆయన ' వరకట్నం " అనే నాటకాన్ని ప్రదర్శింప చేయటమే కాక దానిలో " విమల " అనే నాయికపాత్రను ధరించారు. ఆయన నటనా ప్రతిభకు పెద్దలెంతో ప్రశంసించారు. ఆ పాత్రకు ఆయన జీవం పోశారంటారు. అందువల్లనే ఆయన తన సోదరికి " విమల " అని పేరు పెట్టుకున్నారు. ఆడవేషంలో ఆయన అచ్చంగా తన చెల్లెలు విమల వలనే వుండేవారు.

మద్యపాన వ్యతిరేక ప్రచారానికి దోహదమిచ్చే " దయ్యాల పన్నుగడ " అనే నాటకానికి దర్శకుడు, ప్రయోక్త అయ్యాడు చెన్నారెడ్డి.

**డాక్టర్** :

ఉస్మానియా యూనివర్శిటీ నుంచి 1941 లో ఎం. బి. బి. యస్. డిగ్రీ తీసుకొని , కొద్దికాలం ప్రభుత్వ ఉద్యోగం చేశారు.

---

పటిష్ఠమైన డా. చెన్నారెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో ప్రగతిని సాధిస్తునంది.

[ ఎన్. జి. పవార్ - మహారాష్ట్ర ముఖ్యమంత్రి ]

---

తరువాత దాదాపు అయిదు సంవత్సరాల పాటు రెండు నర్సింగ్ హోంలు స్థాపించి, డాక్టర్ గా ప్రాక్టీస్ చేశారు. నాడు ఆయన రోగులకు చేసిన నిస్వార్ధసేవ తర్వాత ఆయనకు శ్రీ రామరక్ష అయింది.

అయితే ఆ చిన్న చెన్నారెడ్డిలో రాజకీయ చైతన్యం వురకలు వేస్తునంది. వైద్యసేవ, దేశసేవకు అవరోధంగా కనిపించింది. మంచి ప్రాక్టీసు వున్న ఆ వృత్తికి - పెద్దలందరు వారించినా ఆయన స్వస్తి చెప్పి, రాజకీయ రంగంలో ప్రవేశించారు.

దేశసేవ పట్ల ఆయనకు ఎంతటి ఆసక్తి అంటే, రాజకీయ కార్యకలాపాలలో మునిగితేలుతున్నందున, ఆ సమయానికి ఏక్కడో వున్నందున, తండ్రి మరణించగా, ఆయన అంత్యక్రియలకు డాక్టర్ రెడ్డి హాజరు కాలేకపోయారు. అంతేకాదు - తండ్రి అంత్యక్రియల తాలూకు పదవరోజు కార్యక్రమానికైనా కూడా ఆయన హాజరు కాలేక పోయారు. కనీసం పదవరోజు కార్యక్రమానికైనా తాను హాజరు కావాలని ఆయన గట్టిగా అనుకొన్నారు. కాని,

ఆరోజు ఒక సభలో అని వార్యంగా ఆయన యిరుక్కుపోయారు. అక్కడి నుండి కదలడానికి వీలుకాని క్లిష్టపరిస్థితి ఏర్పడింది.

---

భారత దేశ వ్యవసాయ సమస్యలవల్ల డా. చెన్నారెడ్డి కున్న అవగాహన అనంతం. 1953 లో రోం నగరాన జరిగిన ప్రపంచ వ్యవసాయదారుల సదస్సులో పాల్గొన్న భారత ప్రతినిధి వర్గానికి నాయకత్వం వహించిన ఘనత డా. రెడ్డికి దక్కింది. డా. చెన్నారెడ్డికి పరిపాలనా రంగంలో బహుముఖ అనుభవం ఉంది. ఏ పదవి చేపట్టినా, తనదైన ప్రత్యేకతతో ఆ పదవికి సంపూర్ణ న్యాయం చేకూర్చే ప్రతిభాశాలి. ఆయన అనుభవాలు, సాధించిన ఘనవిజయాలు చిరస్మరణీయం. ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా బహుముఖసేవ చేసిన డా. రెడ్డి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రాష్ట్ర స్థాయిలోనేకాక జాతీయ స్థాయి రాజకీయాల్లో ప్రముఖపాత్ర వహిస్తున్నారు.

[ ఎం. జి. రామచంద్రన్, తమిళనాడు ముఖ్యమంత్రి ]

---

ఆ రోజులలోనే తెలంగాణాలో ఏ ఉద్యమం జరిగినా, డాక్టర్ రెడ్డి ముందు వరుసలో ఉండేవారు. ఆయన సహకారంతో ఆయన ఆధ్వర్యంలో ఎన్నో సభలు, సమావేశాలు జరిగేవి. ఆనాటి తెలంగాణా రాజకీయాలకు ఆయన తెరవెనుక సూత్రధారి. పెద్దలను ముందుంచి, తాను వెనుకవుండి ఆయన రాజకీయాలను నడిపేవారు.

1948లో హైదరాబాద్ సంస్థానం విమోచనకు పూర్వం రజాకార్లు విజృంభించి, అమాయక ప్రజానీకంపై విచ్చల విడిగా దాడులు సాగిస్తూ హింసాకాండ ప్రారంభించగా, ఎందరో హైదరాబాద్ సంస్థాన ప్రజలు ఆంధ్ర ప్రాంతంలోకి వచ్చారు.

## పత్రికా సంపాదకుడు :

అట్టివారికి ధైర్యం చెబుతూ, నిజాం ప్రభుత్వ నిరంకుశత్వాన్ని రజాకార్ల దౌర్జన్యాలను ఎదుర్కొంటూ డా. చెన్నారెడ్డి విజయవాడ నుండి ఆ రోజులలో " హైదరాబాద్ " అనే తెలుగు వార పత్రికకు సంపాదకత్వం వహించి, నడిపారు.

హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్ లో విలీనమైన తరవాత 1950 లో తాత్కాలిక పార్లమెంటులో డాక్టర్ చెన్నారెడ్డి సభ్యుడైనారు. అప్పటికి ఆయన వయస్సు 32 సవత్సరాలే. అయితే, ఆ చిన్న వయస్సులోనే ఆయన నెహ్రూ, పటేల్ ప్రభృత జాతీయనాయకుల దృష్టిలోకి వెళ్లారు. అందువల్లనే, పార్లమెంటు సమావేశాలకు వెళ్ళిన వారం రోజులకే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీకి ఆయన " విప్ " అయినారు.

## రాష్ట్ర మంత్రి పదవి :

1952లో జరిగిన ఎన్నికలలో డాక్టర్ చెన్నారెడ్డి హైదరాబాద్ అసెంబ్లీకి ఎన్నికైనారు. శ్రీ బూర్గుల మంత్రివర్గంలో ఆయన సివిల్ సప్లయిస్, వ్యవసాయశాఖ మంత్రి అయినారు. వ్యవసాయమంత్రిగా ఆయన అప్పుడే కొన్ని అంతర్జాతీయ సమావేశాలలో పాల్గొన్నారు. 1956 నవంబర్ లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడేటప్పుడు ఆయన హైదరాబాద్ రాష్ట్రంలో మంత్రిగా వున్నారు.

1956 నవంబర్ - 1962 జనరల్ ఎన్నికల మధ్యకాలంలో ఆయన మంత్రిగా లేరు. అయితే, ఆ నాటి రాజకీయ పరిణామాలన్నింటిలో ఆయన ప్రముఖ పాత్ర వహిస్తూ ఉండేవారు.

1962 ఎన్నికల తరవాత ఆయన సంజీవరెడ్డి మంత్రివర్గంలో ప్లానింగ్ శాఖ మంత్రిగా ఉన్నారు.

---

విపత్కర పరిస్థితులలోకూడా మాటకు - చేతకు లంకె వేసే వ్యక్తి డా. చెన్నారెడ్డి ఎన్నో సంవత్సరాలుగాడా. రెడ్డితో నాకున్న పరిచయంలో ఇదే నేను ఆయనలో గమనించిన సుగుణం. ఎటువంటి అసాధారణ పరిస్థితిలోనైనా ఆయన మాట తప్పడు.

[ కె. సి. పంత్ ]

---

1964లో వచ్చిన శ్రీ బ్రహ్మానందరెడ్డి మంత్రి వర్గంలో ఆయన ఆర్థిక శాఖ మంత్రి.

**కేంద్ర మంత్రి పదవి** :

ఇక్కడ ఒక మాట చెప్పాలి. నెహ్రూ అన్నా, ఆయన లక్ష్యాలన్నా శ్రీ చెన్నారెడ్డికి బాల్యం నుండి అపారమైన అభిమానం, ఆసక్తి అందువల్ల సహజంగా ఆయనకు శ్రీమతి గాంధీపట్ల ఆమె రాజకీయ కార్యక్రమాల పట్ల ఎనలేని విశ్వాసం.

శ్రీ చెన్నారెడ్డి చొరవ, బహుభాషా ప్రవేశం రాజకీయ దక్షత, పరిపాలనా సామర్ధ్యం శ్రీమతి ఇందిరాగాంధీ దృష్టికి వెళ్ళగా,1967లో ఆయన కేంద్రంలో అత్యంత కీలకమైన ఉక్కు శాఖామంత్రి అయినారు. కేంద్ర మంత్రిగా ఆయన తన పరిపాలనా సామర్ధ్యముద్రను కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం పై వేశారు. రాష్ట్ర స్థాయిలోనేకాక, జాతీయ స్థాయిలో సయితం తన సామర్ధ్యాన్ని ప్రదర్శించగలనని ఆయన నిరూపించుకున్నారు.

అయితే 1967 లో జరిగిన అసెంబ్లీకి ఆయన ఎన్నిక కొన్ని సాంకేతిక కారణాలవల్ల చెల్లదని కోర్టు తీర్పు రాగానే ఆయన ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు.

---

డా. చెన్నారెడ్డి జీవితంలో " రాజు - వేదాంతి " సంబంధం ప్రతిబింభిస్తుంది "

తక్షణమైన రాజకీయ అవకాశ వాదికాక, తన రాజకీయ దృక్పధాన్ని వ్యక్తిగత జీవనాన్ని ఒక సద్గుణమైన మార్గంలో సుగమం చేసుకునే మనిషి.

[ కె. వి. నరసిం హన్, యునైటెడ్ నేషన్స్ }

---

తాను అన్యాయం జరిగిందని భావించినప్పుడు మిన్నకుండటం ఆయన ప్రవృత్తికే విరుద్ధం. తెలంగాణాలో ఎన్నో రాజకీయ, సాంఘికోద్యమాలకు నాయకత్వం వహించిన డాక్టర్ చెన్నారెడ్డి 1969లో తెలంగాణా ప్రాంతంలో పరిపాలనా రంగంలో అన్యాయం జరుగుతున్నదని బయలుదేరిన ఉద్యమానికి నాయకత్వం వహించడం అనివార్యమైనది .

ఆ సందర్భంలో ఆయన నాయకత్వంలోని ప్రజా సమితి 1971లో జరిగిన లోక్ సభ మధ్యంతర ఎన్నికలలో పాల్గొనగా, తెలంగాణా ప్రాంతంలోని పద్నాలుగు స్థానాలలో పదింటిని సమితి గెలుచుకున్నది. ఇందిరా ప్రభంజనానికి ఎదురొడ్డి నిలబడగలిగిన చెన్నారెడ్డి నాయకత్వ దక్షత యావద్భారతానికి ఆశ్చర్యం కలిగించింది.

---

డా. చెన్నారెడ్డి గారికి సంగీతంపై మక్కువ - ఎక్కువ. జాతి సంస్కృతి కళారాధకుడు.

మన పవిత్ర వేదాల సారాన్ని జీర్ణించుకున్న డా. చెన్నారెడ్డి జీవితం - గొప్ప సంస్కృతికి పరిపూర్ణమైన వారసత్వం.

[ టి. సదాశివం, శ్రీమతి సుబ్బలక్ష్మి ]

---

## కృష్ణార్జునులు :

అయితే కృష్ణార్జునుల మైత్రి వలెనే శ్రీమతి గాంధీ, డాక్టర్ చెన్నారెడ్డిల రాజకీయ సంబంధం అభేద్యమైనది. గయుని రక్షించడానికి శ్రీ కృష్ణునితోఅర్జునుడు యుద్ధానికి దిగినట్లు, తెలంగాణా హక్కుల రక్షణకు శ్రీ చెన్నారెడ్డి శ్రీమతి గాంధీతో ఎన్నికల యుద్ధంలో పోరాడవలసి వచ్చింది. గయునికి ప్రాణ భయం తొలగగానే తిరిగి అర్జునుడు శ్రీ కృష్ణుని పట్ల యధాప్రకారం విశ్వాసం ప్రకటించినట్లు, తెలంగాణా ప్రయోజనాలకు శ్రీమతి గాంధీ యిచ్చిన హామీలను పురస్కరించుకొని తిరిగి శ్రీ చెన్నారెడ్డి ఆమె నాయకత్వం పట్ల విశ్వాసంతో కాంగ్రెస్ లో చేరారు. ఆంధ్రప్రదేశ్ సమగ్రతను ఆయనే సం రక్షించారు.

## యు. పి. గవర్నర్ పదవి :

1974లో శ్రీ చెన్నారెడ్డి యు. పి. గవర్నర్ గా నియుక్తులైనారు. ఇది సాధారణ విషయం కాదు. భారత దేశంలో అన్నింటికంటె పెద్ద రాష్ట్రం, అందులోను తన సొంత రాష్ట్రమైన యు. పి. కి శ్రీ చెన్నారెడ్డిని గవర్నర్ గా ఆ నాటి ప్రధాని శ్రీమతి గాంధీ నియమించడం ఆయన పట్ల ఆమెకు గల గౌరవానికి నమ్మ కానికి నిదర్శనం.

స్వతంత్రుడైన, సమర్ధుడైన గవర్నర్ గా శ్రీ చెన్నారెడ్డి పేరు తెచ్చుకున్నారు. ఉర్దూ, హిందీ భాషలలో మహూపన్యాసకుడై

---

డా. చెన్నారెడ్డి, తమ ముందుకు వచ్చే వివిధ సమస్యలను సత్వరంగా పరిష్కరిస్తారు. ప్రతిభాశాలి అయిన డా. రెడ్డి ప్రతి విషయంలో తీసుకునే నిర్ణయాలు ప్రయోగాత్మకంగా ఉంటాయి.

[ సి. వి. గుప్త ]

---

నందున, ఆయన యు.పి. లోని హిందూ ముస్లింల ఆదరాభిమానాలను చూరగొన్నారు. గవర్నర్ గా ఉన్నా కూడా ఆయన తన అభిప్రాయాలను నిర్మొగమాటంగా వ్యక్తం చేసేవారు. యు. పి. లో సాంస్కృతిక దైవ కార్యాలలో కూడా ఆయన ఆ రాష్ట్ర వాసివలె పాల్గొన్నందున, ఆ రాష్ట్ర ప్రజలు ఆయనను తమ మనిషిగా భావించారు.

శ్రీ చెన్నారెడ్డి యు.పి. గవర్నర్ గా వెళుతున్నప్పుడు ఇక ఆయన రాజకీయ జీవితానికి స్వస్తి జరిగినట్లు చాలామంది మిత్రులు బాధ పడ్డారు; రాజకీయ ప్రత్యర్థులు ఆనందించారు.

ఎందువల్లనంటే, గవర్నర్ పదవి సాధారణంగా రిటైరింగ్ రాజకీయ వేత్తలకో, రిటైర్డు రాజకీయ వేత్తలకో లభిస్తుంది. రాజకీయంగా నడివయస్సులో వున్న శ్రీ చెన్నారెడ్డి గవర్నర్ పదవికి అంగీకరించడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపట్ల చాలమంది అభిమానులకు ఆందోళన కలిగింది.

అయితే, 1977 అక్టోబర్ లో యు.పి. గవర్నర్ పదవిని విరమించి వచ్చిన డాక్టర్ చెన్నారెడ్డి మరి అయిదు నెలలలో రాష్ట్ర ముఖ్యమంత్రి కాగలరని భావించలేదు.

డా. చెన్నారెడ్డి నిజమైన క్రియాశీలి. నిశ్చేష్టిత వాతావరణంలో అతనొక ప్రభంజనం. ఆచలానికి అనుకూలం కాని మారుతం.

[ స్వామి చిన్మయానంద ]

అయితే , సరైన సమయంలో సరైన నిర్ణయం చేయడంలో ఆయనకు ఆయనే సాటి. తనకు మొదటి నుండి అపార ఆదర విశ్వాసాలుగల శ్రీమతి గాంధీ నాయకత్వంలో పనిచేయడానికే ఆయన నిశ్చయించు కున్నారు.

ఆయన నిర్ణయం సరైనదేనని 1978 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల ఫలితాలు నిర్ణయించాయి. ఆ ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ [ ఇ ] కి అఖండ విజయం చేకూరింది

రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా, గవర్నర్ గా విశేషమైన పరిపాలనా దక్షత, మూడు దశాబ్దాలకు పైగా రాజకీయానుభవం, వక్తృత్వ గరిమ, వచోవిభావం, వ్యూహరచనా దక్షత, కార్యదీక్ష గల శ్రీ చెన్నారెడ్డి సహజంగానే ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు.

ముఖ్యమంత్రి గా ఆయన విధానాలను, చేపట్టిన కార్యక్రమాలను ఈ పుస్తకమే వివరిస్తున్నది. అందువల్ల, వాటిని గురించి ఇక్కడ తిరిగి వివరించవలసిన అవసరం లేదు

ఎన్నో సమస్యలు, ఎన్నో సాధక బాధకాలు, ఎన్నో అవరోధాలు ఎదురైనప్పటికి, వాటిని చాకచక్యంతో పరిష్కరిస్తూ, తన

డా. చెన్నారెడ్డిలో విజ్ఞానం, మతం, రాజకీయం మూర్తీభవించాయి. డా. రెడ్డిలో అగ్రహము - నిగ్రహము రెండూ ఉన్నాయి. ఆయన పరిపాలకుడు. అవసరమైతే ఉద్యమకారుడు. నాయకత్వ సుగుణాలన్నీ డా. చెన్నారెడ్డి లో సంతరించాయి.

[ డా. బి. గోపాల్ రెడ్డి ]

తీవ్ర విమర్శకులను కూడా తనతో సహకరించే వారుగా రూపొందించుకుంటూ డాక్టర్ చెన్నారెడ్డి ముఖ్యమంత్రిత్వం ముందుకు సాగిపోతునంది.

సాధారణంగా మర్రి చెట్టు క్రింద ఏ మొక్క ఎదగదంటారు. కాని ఈ మర్రి ఎదిగేవారిని ప్రోత్సహిస్తుంది వారు ఎదగడానికి దోహదం చేస్తుంది.

డాక్టరుగా " కత్తి " పట్టవలసిన శ్రీ చెన్నారెడ్డి, రాజకీయవేత్తగా " కర్ర " పట్టుకున్నారు. ఈయన ప్రజల నాడి తెలిసిన డాక్టరు; ప్రజలనాడి , వేడి తెలిసిన రాజకీయవేత్త.

డాక్టరుగా వ్యాధులకు తగిన చికిత్స చేయడం ఆయనకు ఎంత బాగా అవగతమో, పరిపాలకుడుగా ఏ సమస్యకు ఏ పరిష్కార మార్గమో బాగా ఎరిగిన వాడు.

ఆయనకు అన్ని విధాల చేదోడు వాదోడుగా ఉండే సతీమణి శ్రీమతి సావిత్రి దేవి.
డాక్టరు చెన్నారెడ్డికి ఇప్పుడు ఇద్దరు కుమారులు - రవీంద్రరెడ్డి , శశిధర్ రెడ్డి .ఒకే కుమార్తె - వసుధాదేవి .

తమ దృక్పథాన్ని సమర్థించినప్పుడూ కూడా డా. చెన్నారెడ్డి దృఢవైఖరి అవలంబించారు.

[ కాసు బ్రహ్మానందరెడ్డి ]

---

శ్రీ చెన్నారెడ్డి ఆరోగ్యం కూడా ఆశ్చర్యకరమైనదే ఆయన వారంలో అనేక రోజులు తెల్లవారు ఝాముపరకు ఫైళ్ళను చూస్తూ రాజకీయ వ్యవహారాలను పరిష్కారం చేస్తూ పనిచేస్తారు. ఏ రెండు మూడు గంటలో నిద్రించి తిరిగి యధాప్రకారంగా తెల్లవారగానే దైనందిన కార్యక్రమాలలో ప్రవేశిస్తారు. బద్దకం, వాయిదా ఆయన నిఘంటువులోనే కనిపించవు. పరుగెత్తని గుర్రాన్ని అయినా కదను త్రొక్కించే మేటి రౌతు ఆయన.

డాక్టర్ చెన్నారెడ్డి చేతులలో నేడు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు భద్రంగా ఉన్నదనడం నిస్సందేహం.

---

డా. చెన్నారెడ్డి నిస్వార్ధ సేవానిరతి, నాయకత్వ లక్షణాలు మనల్ని ఆయనపట్ల కృతజ్ఞుల్ని చేశాయి.

[ చంద్ర శేఖర్ ]

---

ప్రాధాన్యమైన, పరిపాలనా పరమైన ఎన్నో ముఖ్య పదవులను డా. చెన్నారెడ్డి నేర్పుతో, అగ్రస్థాయిలో నిర్వహించారు.

[ ఎస్. కె. పాటిల్ ]

డా. చెన్నారెడ్డి చేతలకు పెట్టింది పేరు. నిర్లక్ష్యం చేయబడ్డ ప్రజలు, ప్రాంతాల అభివృద్ధి కి ఆయన నిరంతరం పాటుపడతారు. శాంతంగా, సంతోషంగా కనిపించే డా. రెడ్డి జీవితమే ఒక ఉద్యమం.

[ డా. హెచ్. కె. మెహతాబ్ ]

ప్రజల ఆశయాల కోసం, దేశ సంక్షేమం కోసం కృషి చేస్తున్నందువల్లే డా. చెన్నారెడ్డి ప్రజా జీవితంలో అంచెలంచెలుగా ఎదిగారు. ఆయన నేతృత్వంలో ఆంధ్ర ప్రదేశ్ ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాలలో సర్వతోముఖాభివృద్ధిని సాధించగలదన్న నమ్మకం. ఉంది.

[ సి. సుబ్రహ్మణ్యం ]

దేశంలో రైతాంగ ఉద్యమానికి డా. రెడ్డి శక్తిమంతమైన నాయకత్వం వహించగలరు. వారిని ప్రగతిపథంలో నడిపించగలరు.

[ టి. భక్తవత్సలం ]

మానవ సేవయే మాధవసేవగా నమ్మి తమ 40 సంవత్సరాల ప్రజాజీవితంలో ఎదురైన పలు అవకాశాలను సద్వినియోగం చేసుకుని, స్వంత రాష్ట్రంలోనేకాక యావత్తు దేశ ప్రజల సంక్షేమం కోసం డా. చెన్నారెడ్డి పాటుపడ్డారు.

[ కంచి కామకోటి శంకరాచార్య ]

## రచయిత గురించి :

పత్రికా రంగంలో అపారమైన అనుభవం గడించిన శ్రీ తుర్లపాటి కుటుంబరావు విజయవాడలో జన్మించారు. శ్రీ తుర్లపాటి 1947 లోనే జర్నలిజంలో ప్రవేశించారు.

ఆయన " ప్రతిభ "' , " ప్రజాపత్రిక " , " ప్రజాసేవ " తదితర పత్రికలలో జర్నలిస్ట్ గా పనిచేశారు. 1960 నుంచి " ఆంధ్ర జోతి " దినపత్రికలో సహాయ సంపాదకులుగా పనిచేస్తున్నారు.

1951లో అఖిల ఆంధ్రప్రజా పరిషత్ తరపున అప్పటి ప్రధాని జవాహర్ లాల్ నెహ్రూ వద్దకు వెళ్ళడానికి నియమించిన అయిదుగురు సభ్యుల కమిటిలో తుర్లపాటి కూడా ఉన్నారు.

CSR

శ్రీ తుర్లపాటి " గార్డియన్ ఆఫ్ తెలుగు " అని కీర్తిశేషులు శ్రీ రాజాజి సంబోధించారు. ఆయన 1950 - 53 సంవత్సరాల మధ్య ఆంధ్రరాష్ట్ర ఉద్యమంలో గట్టిగా పనిచేశారు.

ఆంధ్ర జ్యోతి దిన, వార పత్రికలలో దాదాపు 1500 మంది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల సంగ్రహ జీవిత చరిత్రలను ఆయన రచించారు

.

" ఆంధ్రకేసరి " జీవితంలో కొన్ని అభ్యుదయ ఘట్టాల్, " జాతక కధలు ", " లాల్ బహదూర్ శాస్త్రి ", "జాతి నిర్మాతలు", "వార్తల లోని వ్యక్తులు ", " మహానాయకులు ఆంధ్రకేసరి " "1857 విప్లవవీరులు " అన్న గ్రంధాలను ఆయన రచించారు.

" సామాన్యుల సాహసాలు ", " ప్రసిద్ధపురుషులు " " స్వాతంత్ర్య యోధులు " ప్రఖ్యాత మహిళలు " అన్న శ్రీ తుర్లపాటి గ్రంధాలు ఇంకా వెలువడవలసి ఉన్నది.

" జాతీయ ఫిలిం అవార్డ్ కమిటి " , " చిల్డ్రన్స్ ఫిలిం కమిటి" సభ్యులుగా ఆయన పనిచేశారు.

శ్రీ తుర్లపాటికి " ఉపన్యాస కేసరి " అనే బిరుదును శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య ప్రదానం చేశారు. గడిచిన 26 సంవత్సరాలలో శ్రీ తుర్లపాటి నాలుగు వేల ఉపన్యాసాలు చేశారు.

స్టేట్ ఫిలిం అవార్డ్ కమిటి సభ్యులుగా చలనచిత్రాలకు లక్ష రూపాయలు సబ్సిడి ఇచ్చే స్పెషల్ కమిటి సభ్యులుగా ఆయన పని చేశారు.

1963 నుంచి ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఫాన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 1967 డిసెంబర్ లో హైదరాబాద్ లో జరిగిన చలన చిత్ర పరిశ్రమ సదస్సులో " ఫిలిం ఫాన్స్ కమిటి " కి చైర్మన్ గా ఎన్నికయ్యారు. " ఫిలిం ఫాన్స్ " మాస పత్రికకు కూడా ఆయన సంపాదకులు.

విజయవాడ ఫిలిం ప్రెస్ క్లబ్, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా పదవీ బాధ్యతలను నిర్వర్తించారు.

శ్రీ తుర్లపాటి సతీమణి స్వర్గీయ కృష్ణ కుమారి ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారిణి. విజయవాడలోని నటరాజ నృత్యనికేతన్ కు ఆమె ప్రిన్సిపాల్ గా పనిచేశారు.

..,,,,,,,_______________________________,,,,,,,,,,